సాచార్ పంజాబు దుర్దశకు చాలావరకు మూలకారకుడు. ఈయన సిద్ధాంతము పంజాబ్‌ను హిందీ, పంజాబీ భాషలను మాట్లాడే వారినిగా ఖండించింది. హిందీ దేవనాగరిలోను, పంజాబీ గురుముఖిలోనూ ప్రతివాడికి నేర్పబడుతుంది. కాని ఈయన నేడు పవిత్రుడల్లే వెళ్ళి కృపలాని చంకనెక్కాడు. భార్గవాని నిందిస్తున్నాడు. ఈ దుర్దశ తొలగాలంటే పంజాబ్‌లో శిక్కు, నాన్ శిక్కు పద్ధతిమీద ఎన్నికలు జరగకూడదు. వీళ్ళిద్దర్నీ ఏపార్టీ ధైర్యంగా కూడగట్టుకు రాగలిగితే దానికి జయం తథ్యం. ఇవి పంజాబ్‌లోని నేటి రాజకీయాలు. వీటి దృష్ట్యా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాజయం తప్పదేమో!

———:O:———

స్కెచ్

# కలిసివచ్చిన మాలతి పెళ్ళి

కొమ్మూరి వేణుగోపాలరావు

భర్తకు నెయ్యి వడ్డిస్తూ, "మాలతి పెళ్ళిట." అన్నది శారద.

"ఎవరు చెప్పారు?" అన్నాడు ఆనందరావు అన్నం కలుపుకుంటూ. "ఇందాక మా వూరినుంచి పాలేరు వచ్చాడు. వాడే చెప్పాడు. వచ్చే ఆదివారమేనట" అంది శారద. మాలతి ఆమె మేనత్త కూతురు.

ఆనందరావు ముఖం కొంచెం వివర్ణమయింది. "ఆదివారమా? ఎవరికిస్తున్నారట?" అన్నాడు.

శారదకికూడ వివరాలేమీ తెలియవు. ఆ రోజు వుదయం వాళ్ళవూరినుంచి పాలేరువచ్చి పెళ్ళి విషయం చెప్పాడు. అంతకు తప్ప ఎవరితోనో, ఏమిటో ఆ వివరాలేమీ వాడికికూడ సరిగా తెలియక చెప్పలేదు. ఆ మాటే భర్తతో చెప్పింది శారద.

"అయితే యిప్పుడేమంటావు?" అన్నాడు కొంచెం కఠినంగానే మజ్జిగ కలుపుకుంటూ. భర్త అడిగిన ప్రశ్న శారదకు ఆశ్చర్యం కల్గించింది. రెండు నిముషాలాగి "అనేదేముంది? మా అత్తయ్యకూడా మనం రావటం చాల యిష్టం. మొన్న మావూరికి వెళ్ళినపుడు చెప్పిందికూడానూ, మా మాలతి పెళ్ళి నిశ్చయమయితే మీరిద్దరూ తప్పక రావాలని" అన్నది.

ఆనందరావు అన్నాడు "వెత్తే యింకెప్పుడయినా వెళ్ళవచ్చు. ఈసారి మాత్రం వీలుపడదు."

శారద నిర్ఘాంతపోయింది. తన భర్త యిలా అంటాడని కలలోకూడ అనుకుని వుండదు. "ఏం?" అనే ప్రశ్న ఆమె పెదవులవరకూ వచ్చి ఆగిపోయింది.

ఒక నిమిషమాగి ఆనందరావే అన్నాడు, "వచ్చే ఆదివారం మా రామంగాడి పెళ్ళి. వాళ్ళన్నయ్య యీ వూరొచ్చినపుడు మరిమరీ చెప్పాడు. అయినా యింత త్వరలో నిశ్చయించుకుంటారని అనుకోలేదు."

శారద మాట్లాడలేదు.

"మీ అత్తయ్య యింటికి మనం ఒకటి రెండుసార్లు వెళ్ళాంకాని యిద్దరం కలిసి కామేశం మామయ్య యింటికి ఒక్కసారయినా వెళ్ళలేదు. ఎప్పుడయినా వాళ్ళ వూరికి వెళ్ళినపుడు "నీభార్యను ఎప్పుడూ తీసుకురావేమిట్రా" అని అడుగుతుండేవాడు."

శారదకు కొంచెం కోపంవచ్చింది. "అయితే యిప్పుడు మీరనేది మీవాళ్ళ పెళ్ళికి పోవాలనా?" అంది గద్గదిగ కంఠంతో.

"మరి?"

"అంతేలెండి. మీ యిష్టంవచ్చినట్లు మీరు ప్రవర్తిస్తారు. అత్తయ్య మరిమరీ చెప్పింది. చూడండి మనం వెళ్ళక పోతే బాగుండదు. ఈసారి ఎలా అయినా నామాట చెల్లించండి" అన్నది ప్రాధేయపూర్వకంగా.

"నువ్వు చెప్పింది మరీ బాగుంది. నీ కోరిక చెల్లించి నన్ను అగౌరవపర్చుకోమంటావా? ఏమయినాసరే మావాళ్ల పెళ్ళికి పోవలసిందే" ఖచ్చితంగా అనేసి చెయ్యి కడుక్కునేందుకు లేచాడు. ఈసారి శారద ఏమీ మాట్లాడలేదు.

అప్పటికప్పుడే ఆమె ముఖం జేవురించింది.

ఆనందరావు లోపలికివచ్చి చెయ్యి తుడుచుకుంటున్నాడు. "ఇక్కడ పెళ్లి చూసి, తర్వాత అక్కడికి పోవచ్చులే. అక్కడ పెళ్లికి వుండకపోతే ఏం? మనం పోవటమేగా కావలసింది?"

శారదకీ జవాబు ఏమీనచ్చలేదు. పైపెచ్చు భర్త తనను పరిహసిస్తున్నాడని తలిచింది.

"ఇవాళ సోమవారం. రేపో ఎల్లుండో శుభలేఖ వస్తుంది. రెండురోజులు ముందుగానే వెళ్తే బావుంటుందిగ"అనేసి సావిట్లోకిపోయాడు ఆనందరావు.

గోడనున్న గడియారం టంగుటంగుమని పది కొట్టింది. ఆనందరావుకు వుద్యోగమంటూ ఏమీలేదు. పొలంమీద వచ్చే నాలుగురాళ్లతో బస్తీలో కాపురముంటున్నాడు.

సావిట్లోకి పోయి పడక కుర్చీలో కూలబడి ఏదో సినిమా పత్రిక చూస్తున్నాడు ఆనందరావు.

శారద కాపురానికేమీ వంట్లో బావుండలేదు. భర్త ప్రవర్తన తలుచుకుంటే కళ్ళనీళ్ల పర్యంతం అయింది. తనెంత వుత్సాహపడింది? చక్కగా నలుగురి బంధువులతోనూ కులాసాగా తిరుగుతూంటే ఎంత బాగుంటుంది. ఎవడో రామంగాడట. వాడి మొఖం. వాడి పెళ్ళికూడా యిప్పుడే రావాలి? శారదకు తలుచుకుంటున్న కొద్దీ దుఃఖము ఎక్కువవసాగింది. అత్తయ్య మరీమరీ చెప్పింది. 'మీ రిద్దరూ రండే' అని. తను వెళ్ళకపోతే ఏమనుకొంటుంది. రేపో ఎల్లుండో మాలతి అన్నవస్తే రావచ్చు. అప్పుడు తనేం సమాధానం చెపుతుంది?

శారద కాపూట భోజనం చేయ బుద్ధి పుట్టలేదు. ఆడవాళ్ళకి సహజమయిన ఏడుపును ఆమె ఆరికట్టలేకపోయింది. భర్త తిన్న కంచాన్నయినా శుభ్రపరచలేదు. ఎక్కడి వస్తువులక్కడేవుంచి ప్రక్క గదిలో చాప వేసుకుని పడుకున్నది.

పావుగంట గడిచి వుంటుంది. ఇంతలో వాకిట్లోంచి పోస్టువాడు అరిచిన 'సార్' అన్న అరుపు శారదకుకూడా వినిపించి, ఎక్కడనుంచి వుత్తర మొచ్చిందోఅన్న ఆదుర్దా వున్నా, లేవ బుద్ధెయ్యక అలానే పడుకుంది.

అయిదు నిమిషాలు గడిచాయి. 'శారూ, ఓ శారూ' అంటూ ఆనందరావు గదిలోకి ప్రవేశించి భార్య వాలకం గమనించి తటాలున ఆగిపోయాడు. భర్తపిలుపు వినిపించినా శారద కదలలేదు.

"శారూ" అన్నాడు ప్రేమగా ఆనందరావు. శారద కళ్ళు తెరవనయినా తెరవలేదు. ఆనందరావు మెల్లగా వచ్చి భార్యప్రక్కన కూలబడ్డాడు.

"శారూ! కోపం వచ్చిందా?"

శారద పంతం పట్టింది. ఏమయినా సరే పలక దలుచుకోలేదు.

ఆనందరావు యిలా అడిగి లాభం లేదని చిన్న అస్త్రం ప్రయోగించాడు. "మీ అత్తయ్య దగ్గర్నుంచి వుత్తరమూ, శుభలేఖా వచ్చాయి. మనిద్దర్నీ రమ్మని మరీమరీ రాసింది."

శారద యీ అస్త్రానికి లొంగలేదు. ఉత్తర మొచ్చినా, శుభలేఖ వచ్చినా ఆమెకేంలాభం? ఎలాగూ వెళ్ళనికొడిగ.

"ఛీ. ఏడుస్తున్నావా? లే. మాలతి పెళ్లికే వెళ్దాంలే పోనీ" అని ఆనందరావు శారద ముఖాన్ని బలవంతంగా తనవైపు త్రిప్పుకున్నాడు. శారద ఆపుకుందామని బ్రహ్మప్రయత్నం చేసినా ఆమె పెదవులపై చిరునవ్వు వెలియకపోలేదు.

"నమ్మటం లేదూ?" అన్నాడు ఆనందరావు. అర్థంకానట్టుగా చూసింది భర్త ముఖంలోకి.

"నిజం. మాలతి పెళ్లికే పోదాం."

శారద తృప్తిగా నవ్వింది. అయినా ముప్ఫయి నిమిషాల కాలంలో భర్తలో యిటువంటి మార్పు ఎలా వచ్చిందో అర్థం కాలేదు.

ఆనందరావు అన్నాడు "నేను యిలా అనటం ఆశ్చర్యంగా వుంది కదూ. అసలు సంగతి చెప్తాను విను. ఇవాళ రామం వాళ్ళ దగ్గర్నుంచి కూడా శుభలేఖ వచ్చింది. అసలు విషయం ఏమిటంటే మా రామంగాడికే మీ మాలతిని యివ్వటం"

శారద తెల్లబోతూ భర్త ముఖంలోకి చూచింది.